# అద్వైతం



ఇందులో ...

1.అద్వైతం
2.నేనెవరు?
3.'జగమంతకుటుంబం' పాట పై విశ్లేషణ
4.అస్తిత్వవాదం
5.వేదాంత మహావాక్యాల పై విశ్లేషణ .
6.అద్వైతాన్ని గూర్చి స్వామి వివేకానంద

## ముందుమాట

వ్యక్తి స్వేచ్ఛ విశృంఖలతగా మారి ప్రమాదంగా పరిణమించకుండా ,నియంత్రించడానికి చట్టాలు,సంస్కారం సహకరిస్తాయి. భారతదేశంలో చట్టాలకంటే సంస్కారానికే ప్రాధాన్యత ఎక్కువ. మతము ,సంస్కృతి ,సాంప్రదాయం ,కళలు, వేదాంతం ఇవన్నీ సంస్కారాన్ని పెంపొందించడానికే ఉన్నాయి. చట్టాలకు ప్రాధాన్యత ఇచ్చే పాశ్చాత్యులు ఈ దేశాన్ని పరిపాలించడం వల్ల , ఇప్పటి పాలకులు పాశ్చాత్య పద్ధతికే ప్రాధాన్యత యిస్తూ స్వేచ్ఛను నియంత్రించడానికి, ప్రత్యేక చట్టాలను రూపొందించడం, చట్టాల పట్ల అవగాహన కలిగించే ప్రయత్నం చేస్తున్నారు. ఇది ఈ దేశ సాంప్రదాయం కాకపోవడంతో ఆశించిన ఫలితాలు రావడంలేదు. దేశం(వ్యక్తి) ఆత్మ పరిశీలన చేసుకుని మళ్ళీ సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని పొందితే , అపుడు చట్టాలు చేసే పనిని సంస్కారం చేస్తుంది .

గురువు లేకపోయినా ఏకలవ్యుడు విలువిద్యను సాధించినట్లు, సంస్కారాన్ని పెంపొందించే పరిస్థితులు సమాజంలో లేకపోయినా, స్వయంసంస్కారాన్నిసాధించవచ్చు. అలా సంస్కృతి పై నమ్మకముంచి స్వయం సంస్కారాన్ని సాధిస్తున్నవారికి, నాస్తికవాదులు, హేతువాదుల్లోని అతివాదులు అడుగడుగునా అడ్డుతగులుతూ ఉంటారు. వీరికి నిర్మూలించడమే గానీ , నిర్మాణం చేసే శక్తి లేదు. కొండనాలుక్కి మందేయ్యమంటే ఉన్న నాలుకను ఊడగోడతారు. మూఢనమ్మకాలను పోగట్టవలసిన హేతువాదంతో ,ఏకంగా నమ్మకాలనే నిర్మూలించే ప్రయత్నం చేస్తారు . ఇది అయ్యే పని కాదని చరిత్ర పరిశీలిస్తే తెలుస్తుంది .

భారతీయ సంస్కృతిలో జీవం ఉంది. అందుకే తరతరాలుగా ఎవరెన్ని దండయాత్రలు చేసినా ప్రతిఘటించి నిలబడుతోంది. హేతువాదులు ప్రజల విశ్వాసాలను ప్రశ్నించే బదులు అసలు ఈ నమ్మకాలు తరతరాలుగా నిరాటంకంగా కొనసాగుతూ రావడంలోని అంతర్యం ఏమిటి? అని ప్రశ్నించుకుంటే బావుంటుంది.

నేటి పరిస్థితుల్లో , సాంకేతిక విప్లవంతో సమానంగా సాంస్కృతిక విప్లవం సాగాల్సిన అవసరాన్ని గుర్తించి ఈ రచన చెయ్యడం జరిగింది . ఇంకా నేనెందుకు వ్రాసానంటే ......

జీవితం గతానుగతికమై ,సంప్రదాయాలు అర్థరహితమై పోవడమేగాక దుఃఖానికి బాధకూ కారణమై, ఆచారాలు ,అలవాట్లు ఆత్మహత్యా సదృశాలుగా మారినపుడు కొత్తదానాన్ని అన్వేషించడం మానవ సహజ ప్రవృత్తి.

భారతదేశం విషయానికొస్తే కొత్తదనాన్ని అన్వేషించే శ్రమ లేకుండా పాశ్చాత్యుల అలవాట్లు,అభిరుచులు readymade గా దొరుకుతున్నాయి.ఈ పాశ్చాత్య సంస్కృతి మన జీవిత విధానం మీద ప్రభావం చూపి సంక్షోభానికి దారితీస్తోంది.ఈ సంక్షోభం నుంచి బయటపడాలంటే స్వీయ సంస్కృతిని కొత్తగా దర్శించవలసి వస్తోంది. సంస్కృతి మూలాలను పునఃదర్శించి దాన్ని వర్తమాన జీవితంతో సమన్వయం చేసుకోవలసి వస్తోంది. ఈ అవసరం నాకూ ఏర్పడింది . అందుకే వ్రాసుకోవలసివచ్చింది. గుంటూరు శేషేంద్రశర్మ గారన్నట్టు “నీవు జీవితంలో ఎన్ని రంగులతో ఆడుకున్నా ఏదో ఒకనాడు నీవు అదృష్టవంతుడవై నీ ప్రాచీన చీకటిని కలుసుకోకతప్పదు”.

“తనకీ ప్రపంచానికీ సామరస్యం కుదిరేదాకా కవి చేసే అంతర్ బహిర్ యుద్ధారావమే కవిత్వం” అని చలం అంటే ,చలాన్ని గూర్చి శ్రీశ్రీ “ యావత్ భారత దేశమూ రాజకీయ స్వాతంత్ర్యం కోసం పోరాడుతున్న రోజుల్లో ,భావ స్వాతంత్ర్యం కోసం ,మానసిక స్వాతంత్ర్యం కోసం పోరాడినవాడు చలం . రాజకీయ స్వాతంత్ర్యం సాధించి ,ఇంకా ఆర్థిక స్వాతంత్ర్యం కోసం సతమతమవుతున్న మనం ,చలం మహర్షి ఇదివరకే సాధించిన మానసిక స్వాతంత్ర్యం గమ్యం చేరుకోవడానికి చాలా కాలం పట్టవచ్చు . కాని ఆ గమ్యం వైపుగానే మానవ జాతి ప్రయాణిస్తోంది”.అంటూనే మరో మాట కూడా అన్నాడు.“కవిత్వమూ, స్వాతంత్ర్యమూ ఎవ్వరికీ ఎప్పటికీ అందని అందాలే అయినప్పటికీ ,వాటిని సాధించాలనే ప్రయత్నంలోనే, ఆ ప్రయత్నంలోని ఆవేగంలోనే ,ఆ ఆవేగంలోని ఆ అశాంతి లోనే ,అశాంతిలోని ఆనందంలోనే ఉంది జీవితానికి సార్థక్యం”. “ ఇది సామాన్య మానవుని యుగం .. సామాన్య మానవుడంటే ఎవరు? నువ్వూ, నేనూ ,వాడూ ,వీడూ . ఒక ప్రత్యేక మానవుడు కూడా . ఈ ప్రత్యేకత్వం చాల అమూల్యమైనది . దీన్ని గుర్తించుకోవడం ,పెంపొందించుకోవడం ఇదే జీవితానికి సార్థకత”

సామరస్యం ,స్వాతంత్ర్యం ,సార్థకత వీటికోసం నేను వ్రాసుకున్నాను .వీటికోసం చేసే ప్రయత్నం ఎప్పుడూ మనస్సు యొక్క తత్వాన్ని స్వీయమైన అనుభూతి ద్వారా అర్థం చేసుకోవాలనే జిజ్ఞాసతో ప్రారంభమై అద్వైతానుభూతితో ముగుస్తుంది . తత్వ విచారణలో కొత్తదనం ఏమీ లేకపోవచ్చు . కానీ ఎవరికి వారు ప్రపంచాన్ని ,సమాజాన్ని తాత్విక సిద్ధాంతాలను సొంతంగా అనుభూతి ద్వారా స్పృశించి,అవలోకించి ,ఆలోచించి ,ఆనందించాలనుకుంటారు .ప్రతి వ్యక్తికి కూడు,గుడ్డా ప్రాథమిక అవసరాలైనప్పటికీ తర్వాతి అవసరం ఈ మానసికమైన ,సృజనాత్మకమైన స్వేచ్ఛ.

మనిషిని ,సమాజాన్ని అర్థం చేసుకోవడానికి సాహిత్యం బాగా ఉపకరిస్తుంది . ఈ విషయంలో R .S . సుదర్శనం గారి పుస్తకాలు నాకెంతో ఉపకరించాయి .

పోతే నేను వ్రాసినదాన్ని పదిమందికి ఎందుకు share చేస్తున్నానంటే మన ప్రాచీన ఋషులు అందించిన అద్వైత విజ్ఞానాన్ని ,నిత్యజీవితంతో ఎలా అన్వయించుకోవచ్చో తెలియచెప్పడానికి, తద్వారా ఆ ఋషుల ఋణం తీర్చుకోవడానికి, అంతే.

# అద్వైతం

వినాయకుడి వివాహఘట్టాన్ని పరిశీలిస్తే ముందుగా లోకాన్ని చుట్టి వచ్చిన వానికే వివాహం జరిపిస్తానని శివుడు కుమారస్వామికి , వినాయకునికి పరీక్ష పెడతాడు . కుమారస్వామి వెంటనే బయలుదేరుతాడు . వినాయకుడు అలోచించి సృష్టిలో ఉన్నది ప్రకృతి పురుషులైన తన తల్లిదండ్రులు శివపార్వతులేనని, వారి చుట్టూ తిరిగితే లోకాన్ని చుట్టివచ్చినట్టేనని అద్వైత దృష్టితో వారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తాడు . ఆ దృష్టి ఉండడం వల్లే వినాయకుడు కాలు కదపకుండానే కార్యం సాధించాడు .

అద్వైత దృష్టి మనకు తెలియకుండానే అప్పుడప్పుడు ముఖ్యంగా పర్వదినాల్లో కలుగుతుంది.పండగలప్పుడు బంధువులు స్నేహితులు అందరూ ఏకం అవుతారు . దానధర్మాలు చేస్తారు . సాంఘిక చారిత్రక ఆర్థిక వ్యత్యాసాలకు అతీతంగా అందరూ ఒకటనే భావన కలుగుతుంది . మర్నాడు మళ్ళీ మామూలే . పండగ రోజు సామూహికంగా పొందిన అద్వైతానుభూతిని వ్యక్తిగతంగా పొందగలిగితే ప్రతిరోజు పండగే . ఇందుకోసం పైసా ఖర్చుపెట్టక్కర్లేదు . కాలు కదపక్కర్లేదు . వినాయకుడిలా సూక్ష్మంలోనే మోక్షం పొందవచ్చు .

## 1

అద్వైతం అన్న మాట లోనే ద్వైతం ఉంది . ద్వైతం అంటే రెండు . ఆ రెండూ ఒక్కటనే భావం అద్వైతంలో ఉంది .

$$1^{+1} \times 1^{-1} = 1$$

ద్వైతం (ఆలోచన) అద్వైతం (అనుభూతి)

ద్వైతంలో ఉన్న పాజిటివ్ నెగిటివ్ లు ($1^{+1} \times 1^{-1}$) అద్వైతంలో ఒకటి (1) అయ్యాయి.అలాగే ఆలోచనల్లో ఉండే పాజిటివ్ నెగిటివ్లు (సుఖం x దుఃఖం, మంచి x చెడు మొదలైనవి ) అనుభూతి లోనే ఏకం అవుతాయి. ఏకం అయినప్పుడు మిగిలేది ఏకాంతం.నిశ్శబ్దం .అనుభూతి కిటికీలాంటిది . అది రెండిటిని కలుపుతుంది .

$$1^{+1} \times 1^{-1} = 1$$

ప్రోటాన్ × ఎలెక్ట్రాన్ = పరమాణువు

సుఖం × దుఃఖం = మానవుడు

పరమాణువు లో భిన్న విద్యుదావేశాలు కల ఎలెక్ట్రాన్ ప్రోటాన్ లు ఒకదాని ఆవేశాన్ని మరొకటి తుల్యం చేస్తుండడం వల్ల పరమాణువు స్థిరంగా ఉంటోంది . ఎలెక్ట్రాన్ ప్రోటాన్ లలో ఏ ఒక్కటి లేకపోయినా పరమాణువు స్థిరత్వాన్ని కోల్పోయి ఆవేశపూరితమౌతుంది . అలాగే మానవునిలో ఉండే సుఖ దుఃఖాలు ఒక దాని ఆవేశాన్ని మరొకటి తుల్యం (neutral) చెయ్యకపోతే, అతడు స్థిరత్వాన్నికోల్పోయి ఆవేశపూరితుడౌతాడు .

ఆపిల్ పండు ఉంది . దాన్ని గూర్చి ఎన్ని విధాలనైన వర్ణించవచ్చు . కానీ దాన్ని కంటితో వస్తువుగా చూసినపుడు కలిగేది ఒక అనుభూతి . దాన్ని కొరికి తినడం మరొక అనుభూతి . ఈ రెండూ కాక మూడో రకం దాన్ని గూర్చి హెన్రీ మికాక్స్ చెబుతాడు. “ I set an apple on the table.Then I set myself in the apple. what utter calm.” రెండు వస్తువులు విడివిడిగా ఉన్నపుడు వాటి మధ్య communication ఉంటుంది . ఆ రెండూ comm ‘union’ ఐనపుడు (ఒక్కటైనపుడు) ఇక వాటి మధ్య communication ఉండదు . మిగిలేది నిశ్శబ్దం (calmness)

పై ఉదాహరణ లో దృశ్యమూ(apple) ద్రష్ట (నేను) ఒకటి అయ్యాయి . ఇలా (దృశ్యము x ద్రష్ట) ; (సృష్టి x నేను) ఒక్కటి కావడమే మూడో రకమైన అనుభూతి .మెర్లిన్ పొంటీ అంటాడు . “The world is not what I think,but what I live”. అలా వస్తు ప్రపంచాన్ని గుర్తించడమే అనుభూతి .

$$1^{+1} \times 1^{-1} = 1$$

నువ్వు × నేను = మనం

‘మనం’ ముక్కలై నువ్వూ,నేనూ అయి ఉత్తర,దక్షిణాలకు ప్రయాణం చేసింది.

$$(X^{+1} \times X^{-1}) = 1$$

| | |
|---|---|
| అనేకత్వం | ఏకత్వం |
| జగమంతకుటుంబం | ఏకాకి |

ఏకత్వం,రెండుగా అనేకం(X)గా మారి కనిపించడం మయాసృష్టి . ఈ మాయను,అనేకత్వాన్ని తొలగించుకొని తిరిగి ఏకత్వాన్ని ప్రతిష్ఠించడం మానవుడు చేయవలసిన సృష్టి.ఏకత్వం, అనేకత్వాన్ని వ్యాపించి తనతో ఏకం చేసుకుంటోంది . ఈ వ్యాపించడమే జ్ఞానం,ప్రేమ, చైతన్యం. ఏకత్వం ‘నేను’ అయితే అనేకత్వం ‘నాది’. ‘ఏకాకి’ని నేనైతే జగమంతకుటుంబం ‘నాది’

## 2

$$1^{+1} \times 1^{-1} = 1$$

| | |
|---|---|
| రెండు | ఒకటి |

ఒకటిని రెండుగా విడగొట్టి చూసేవారిది లౌకిక దృష్టి . రెండింటిని కలిపి ఒకటిగా చూసేవారిది అలౌకిక దృష్టి . విష్ణుమూర్తిది లౌకిక దృష్టి. ఆయన దేవతల్ని , రాక్షసుల్ని వేరుగా చూస్తాడు . అమృతాన్ని రాక్షసులకు దక్కనివ్వలేదు. పరమేశ్వరుడిది అలౌకిక దృష్టి. ఆయన అందర్నీ ఒక్కలాగే చూస్తాడు.రాక్షసులైనా వారు చేసిన తపస్సు ఫలిస్తే కోరింది ఇస్తాడు

కేశవుడిది లౌక్యం(logic). శివుడిది ఆత్మీయత(music)

లోకంలో ఉంటూ లౌకిక సమస్యలు ఎదుర్కుంటూనే అలౌకిక ఆనందాన్ని పొందడానికి వైష్ణవ తత్వం , శివ తత్వం (logic and music ) రెండూ అవసరమే . శివ కేశవుల మూర్తులు వేరైనా వారి మూల తత్వం ఒకటే. అది సర్వేజనాస్సుఖినోభవంతు.కులమతాలను బట్టి కాకుండా మంచి చెడ్డల్ని బట్టి మనుషుల్ని విడగొట్టే విష్ణువుపై ,కులమతాలకు అతీతంగా అందర్నీ ఒక్కలాగా చూసే శివుడిపై మతముద్ర వేయడం ఎంతవరకు సబబు. అంతర్ముఖుడైన శివుడు అంతరంగాన్ని సంస్కరిస్తే ,బహిఃర్ముఖుడైన విష్ణువు బాహ్య పరిస్థితుల్ని చక్కదిద్దుతాడు . సంస్కరణ బహిఃరంతరాలురెండిట్లోనూ జరగవలసిందే. అప్పుడే ఆదర్శానికి, ఆచరణకు; మాటలకు,చేతలకు పొంతన కుదురుతుంది.

3

$$(1^{+1} \times 1^{-1})^{+1} \times (1)^{-1} = 1$$

వియోగం సంయోగం ఒకటి

జీవితంలో ఎదురయ్యే సంయోగ వియోగాలను ఒక్కటి చెయ్యడంలో వ్యక్తి పొందే సాఫల్య వైఫల్యాలే సుఖ దుఃఖాలకు కారణమౌతుంటాయి . ధర్మార్థకామమోక్షాలలో అర్థకామాల వల్ల సంయోగ వియోగాలు ఏర్పడితే , మొదటిదైన ధర్మం ఆ సంయోగ వియోగాలను ఒక్కటి చేస్తుంది. అర్థకామాలవల్ల పాండవులతో ఏర్పడిన సంయోగ వియోగాలను ఒక్కటి చేసే ధర్మం(కృష్ణుడు) కౌరవుల వద్ద లేకపోవడంతో వారు యుద్ధంలో ఓడిపోయారు . అలాగే దక్ష యజ్ఞానికి శివుడు(ధర్మం) తప్ప అందరూ ఆహ్వానింపబడ్డారు . ధర్మాన్ని ,శివుణ్ణి నిర్లక్ష్యం చెయ్యడంతో దక్ష యజ్ఞం ధ్వంసమైంది . శివపార్వతుల మధ్య ఏర్పడిన సంయోగ వియోగాలను ధర్మం (వివాహం ) ఒక్కటి చేసింది .

ఈశ్వరః సర్వభూతానాం హృద్దేశోర్జున తిష్ఠతి . -- అన్ని జీవులలోను ఉన్న భగవంతుణ్ణి తనలో గుర్తించి ధర్మానికి ప్రాధాన్యత ఇచ్చినపుడే వ్యక్తికి తన జీవితం తనదిగా కష్టమైనా సుఖమైనా సంతృప్తి నిస్తుంది .

ధర్మానికి ప్రాధాన్యత ఇచ్చే స్థితిని పొందినప్పటికిని మానవ జీవితంలో అర్థంకాని భాగం మిగిలే ఉంటుంది . తను చేసే కర్మతో, తన ధర్మ నిర్వహణలతో ,భాధ్యతతో ప్రమేయం లేకుండా సంభవించే అనుభవాల్ని మనిషి ఎలా అన్వయం చేసుకోవాలి. వాటిని యాధృచ్ఛికమని , దైవికమని వ్యహరిస్తూంటాం . ఒక స్త్రీ తన కుమారుడు హఠాత్తుగా మరణించడం చూసి అంతులేని ఆవేదనకు గురైంది . ఆమె పొందే బాధను ఏ ధర్మంతోనూ అన్వయించడం సాధ్యం కాదు . ఇక్కడ విక్టర్ ఫ్రాంక్ అనే మనస్తత్వశాస్త్రజ్ఞుడు ఒక సామ్యం చెబుతాడు . ఒకానొక కోతిని శాస్త్ర పరిశోధనలో

మానవులకు కావలసిన రోగ నివారణౌషధం కనిపెట్టడం కోసం మాటి మాటికి సూదితో పొడిచి రక్తం తీస్తూంటారు . ఆ కోతి అనుకుంటుంది “ఈ యాదృచ్ఛికమైన ,అకారణమైన బాధ ఏమిటి నాకు? ఇంకా ఎన్నిసార్లు అనుభవించాలో ” అని. దాని బాధకూ మానవలోకంలో ఒకానొక ప్రయోజనానికి సంబంధం ఉన్నదని దాని కెట్లా తెలియటం ? వీలుకాదన్న మాట ! అలాగే పై చెప్పిన స్త్రీ తో “అమ్మా , నీవు పొందే ఆవేదనకు అర్థం ,మానవుని మేధకూ , అవగాహనకు అందని ఏ లోకంతో, ఏ పరమార్ధంతో ముడిపడి ఉన్నదో ఎవరు చెప్పగలరు.” అంటూ ఆ శాస్త్రజ్ఞుడు ఆమెతో స్వాంతన పలికాడట.యాదృచ్ఛికమూ ,దైవికమూ అన్నదానికి అర్ధం , సమాధానం మాటల్లో అనగా బుద్ధితో ఆలోచించి తేల్చేది కాదు. ఆ సమాధానం జీవించటంలో ఎవరికి వారు తమ అస్తిత్వం నుంచీ పొందవలసిందే . అలా పొందగలిగినవాడే ఆధ్యాత్మికమానవుడు . ఇక్కడ గమనించవలసిన ముఖ్యాంశం - తత్వ జిజ్ఞాస చెయ్యడం , సాధన ఆధ్యాత్మికత కాదు . తత్వమే తాను కావటం ఆధ్యాత్మికత . తత్వమూ తానూ ఒక్కటి కావడమనే మూడోరకమైన అద్వైతానుభూతి ఇక్కడ వర్తిస్తుంది . “ఉప్పు కప్పురంబు ఒక్క పోలిక నుండు .... పురుషులందు పుణ్య పురుషులు వేరయా” అన్నట్లు ఆధ్యాత్మిక మానవుడు లోకంలో అందరిలా వ్యవహరిస్తూనే అస్తిత్వ వైశిష్ట్యం వల్ల నిర్లిప్తుడై వేరుగా ఉంటాడు .

అద్వైతం రెండింటికి మధ్య ఉన్న సంబంధాన్ని , సంఘర్షణను (సంయోగ వియోగాలను )గుర్తించి వాటి మధ్య సమన్వయాన్ని సాధిస్తుంది . ఆ సమన్వయమే ధర్మం. ధర్మాన్ని గ్రహించలేని స్థితిలో, అర్జునుడు కృష్ణుణ్ణి ఆశ్రయించినట్టు ,భగవంతుణ్ణి ఆశ్రయిస్తే ధర్మం దానంతట అదే స్పష్టం అవుతుంది .

# నేనెవరు?

ఈగ ఇల్లు అలుకుతూ పేరు మర్చిపోయిన కథ అందరికీ తెలుసు. పేరు మర్చిపోవడంతో మొదలైన కథ ,ఒక అన్వేషణగా సాగి ,పేరు మళ్లీ గుర్తుకుతెచ్చుకోవడంతో ముగుస్తుంది .

మానవుని కథాఅంతే. ఈగ ఇల్లు అలుకుతూ పేరు మర్చిపోయినట్టు,లౌకికవ్యవహారాలలో పడి,మానవుడు తాను ఎవరైనదీ మరచిపోతున్నాడు. “నేనెవరు?” అని ప్రశ్నించుకొని,సమాధానం కోసం అన్వేషిస్తున్నాడు. ఆ అన్వేషణే ఆధ్యాత్మిక సాధన. మానవుని చరిత్ర.

చిన్నతనంలో తరతమ బేధాలు తెలియవు. ఆ అమాయకత్వం అమూల్యమైనది. పెద్దయ్యాక ‘సామజిక స్పృహ’ ఏర్పడుతుంది. అంతరాలు,అభిప్రాయాలు ఏర్పడి నామరూపాలకు ప్రాధాన్యత పెరుగుతుంది. ఈ సామాజిక స్పృహ కొన్నాళ్ళకు నిస్పృహ కలిగిస్తుంది.దానికి తోడు చేసే పనే కాదు,తీరిక సమయంలో చేసే కాలక్షేపం కూడా యాంత్రికం అయిపోవడం. దీనివల్ల అర్థాన్ని గడిస్తున్నా, బ్రతుకు అర్థశూన్యంగానే వుందే అనిపిస్తోంది.

ఈ నిస్పృహ నుండి బయటపడి జీవితం పట్ల ఆసక్తీ,ఉత్సాహం ఏర్పడాలంటే సమాజాన్ని, పరిస్థితుల్ని దాటి చూడాలి. అత్మజిజ్ఞాసకు పూనుకోవాలి. ఇందుకు సంస్కృతి సహకరిస్తుంది.

శివుడు ఆత్మ స్వరూపుడు . అందువల్ల శివుడి లక్షణాలనే ఆత్మ లక్షణాలుగా గుర్తించవచ్చు.

శివుడికి లింగభేదం లేదు. తనలో అటువంటి భేదాన్ని సృష్టించబోయిన మన్మధుడిని దహించాడు. కాముడిని జయించాడు.

శివుడికి స్వపరబేధం లేదు. ఆయన అందర్నీ ఒక్కలాగే చూస్తాడు .రాక్షసులైనా వారు చేసిన తపస్సు ఫలిస్తే, కోరింది ఇస్తాడు .

శివుడు అమృతాన్ని విషాన్ని వేరుగా చూడడు . సత్ప్రయోజనం కోసం అవసరమైతే విషం పుచ్చుకుంటాడు.

ఈశ్వరుడు సంసారాన్ని, సన్యాసాన్ని విడగొట్టడు. సన్యాసిగా మన్మధుడిని కాల్చి బూడిద చేసినవాడే ,పార్వతిని వివాహమాడి సంసారి అయ్యాడు. మన్మధుడిని మళ్ళీ బ్రతికించాడు. ఈ భిన్న తత్వాల వెనక ఉన్న ఏకత్వమే అర్ధనారీశ్వర తత్వం . ఈ తత్వాన్నే సిరివెన్నెల సీతారామ శాస్త్రి గారు, 'సంసార సాగరం నాదే ,సన్యాసం శూన్యం నావేలే' అని తన 'జగమంత కుటుంబం'పాటలో వ్యక్తం చేసారు

శివుడు జననాన్ని,మరణాన్ని వేరుగా చూడడు . కాబట్టే ఆయనకు జననం లేదు. స్వయంభువు . మరణం లేదు. మృత్యుంజయుడు .

శివుడికి నామరూపాలకు అతీతుడు . అందుకే ఆయన లింగరూపంలో వున్నాడు .

శివుడికి మూడోకన్ను(జ్ఞాననేత్రం) ఉంది.అందువల్ల ఆయనకు తన్ను గూర్చిన జ్ఞానం(ఆత్మజ్ఞానం) ఉంది .

శివపార్వతుల వివాహ ఘట్టాన్ని పరిశీలిస్తే, మన్మధుడు,పార్వతి కలిసి శివుడికి తపోభంగం కలిగించి,శివుడి ఆగ్రహానికి గురై ,మన్మధుడు ప్రాణాల్ని ,పార్వతి శివుడి విశ్వాసాన్ని కోల్పోయారు.శివుడే ఆత్మ కాబట్టి శివుడి విశ్వాసాన్ని కోల్పోవడమంటే ఆత్మవిశ్వాసాన్ని కోల్పోవడమే. పైన చెప్పిన ఆత్మ లక్షణాలపై విశ్వాసాన్ని కలిగి ఉండడమే ఆత్మ విశ్వాసంతో ఉండడం. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోయిన పార్వతి అందుకోసం తపస్సు చేసింది . ఆత్మవిశ్వాసం కోసం ప్రయత్నించడం ఒక తపస్సు . తపస్సు ద్వారా పార్వతి ఆత్మ(శివుడి)విశ్వాసాన్ని తిరిగి పొందింది.తపస్సులో శివుడి లక్షణాలను అంటే ఆత్మ లక్షణాలను ఆమె గుర్తించి శివుడి సాక్షాత్కారం అంటే ఆత్మసాక్షాత్కారం పొందింది . శివపార్వతులు ఒక్కటయ్యారు . శివుడి శరీరం పార్వతి(ప్రకృతి)ఐతే ,పార్వతి ఆత్మ శివుడు(పురుషుడు). శివపార్వతుల,ప్రకృతిపురుషుల,దేహాత్మల ఐక్యరూపమే వ్యక్తి . అందువల్ల దేహాభిమానంతో సంసారంలో ఉన్నా,ఆత్మాభిమానంతో సన్యాసంలో ఉన్నా,దేహాత్మలను ఒకటిగా చూస్తూ వాటి మధ్య ఐక్యత సాధించడం ముఖ్యం .ఐక్యత లోపిస్తే 'వ్యక్తి'త్వం లోపిస్తుంది . అర్ధనారీశ్వర తత్వంలో వ్యక్తిత్వం ఉన్నది .

శివపార్వతులిద్దరూ తపస్సు ద్వారానే ఒక్కటయ్యారు . తొలిచూపు ప్రేమలో (love at first sight ) శివుడికి నమ్మకం లేదు. అందుకే మొదట మన్మధుని జోక్యాన్ని, పార్వతిని తిరస్కరించాడు . తపస్సు ద్వారా ఒకరి విశ్వాసాన్ని మరొకరు చూరగొన్న తర్వాతనే వారు వివాహం చేసుకుని ఆదిదంపతులయ్యారు. నేటి ప్రేమలో ఈ తపస్సు ,విశ్వాసం లోపించి, మన్మధుని జోక్యం ఉంటోందని , కొన్ని రాజకీయ పార్టీలు 'ప్రేమికుల రోజు' ను బహిష్కరిస్తున్నాయి .

శివుడు తన దేహాన్ని (ప్రకృతిని) ఆలిగా చేసుకున్నాడు . ఈ దృష్టి తోనే శాస్త్రి గారు 'నా హృదయమే నాకు ఆలి' అన్నారు తన 'జగమంతకుటుంబం' పాటలో. (ఈ పాట పై విశ్లేషణను ముందు పేజీలలో చూడవచ్చు)

శివపార్వతుల (దేహాత్మల) కలయికే వ్యక్తి . ఆ వ్యక్తి విష్ణుమూర్తి అనుకుంటే , విష్ణువుకు నిశ్చితరూపం లేదు. ఆయన ఆకాశంలో పక్షిగా,నీటిలో చేపగా, ఇలా పరిస్థితిని బట్టి అవతారాన్ని మారుస్తూ తన అస్తిత్వాన్ని నిలుపుకుంటున్నాడు. అలా ,మానవునితో సహా అన్ని జీవులూ ఆయన అవతారాలే అయినపుడు నేను ఎవరిని?. మానవుణ్ణా! మాధవుణ్ణా!. మానవుణ్ణి అనుకుంటే నేనొక రూపానికి నామానికి పరిమితుణ్నవుతున్నాను. ఇది బంధం. మాధవుణ్ని అనుకుంటే నేను అపరిమితుణ్ని. అన్ని రూపాలు నావే. ఇది స్వేఛ్ఛ. అన్నిరూపాలు నావే నంటూ సిరివెన్నల సీతారామ శాస్త్రి గారు,జగమంతకుటుంబం పాటలో "కవినై ,కవితనై ,భార్యనై భర్తనై ,రవినై శశినై ,దివమై నిశినై ,నాతో నేను సహగమిస్తూ ..." అంటూ తన అపరిమితత్వాన్ని,స్వేచ్ఛను వ్యక్తం చేసారు . ఆ పాటలోనే ఒంటరితనాన్ని,ఏకాకిజీవితాన్ని(ఏకాంతాన్ని) ప్రస్తావించారు . అన్ని రూపాల్లో ఉన్నది నేనే అయినప్పుడు ఉన్నది నేనొక్కడినే .అందువల్ల నేను ఒంటరిని . ఏకాకిని.అన్ని రూపాలూ నావే కనుక నాది జగమంత కుటుంబం .

అంతా నేనే అయినపుడు,ఇతరులను హింసించడమంటే, నన్ను నేను హింసించుకోవడమే అవుతుంది.

## 3

సృష్టి చేయాలంటే సృజనాత్మక శక్తి (బ్రహ్మ) కావాలి . విష్ణువు లోనే బ్రహ్మ ఉన్నాడు. ఆయనలోంచే పుట్టాడు(వ్యక్తం అయ్యాడు). అందువల్ల విష్ణువు తన్ను తాను పునఃసృష్టించుకుంటూ పరిస్థితిని బట్టి అవతారాన్ని మారుస్తున్నాడు .

ఇపుడు , "నేనెవరు?", అని మానవుడు ప్రశ్నించుకుంటే,

దేహాత్మలు ఉన్నందున అతడు శివుడా ?

మానవరూపంలో ఉన్న విష్ణువా ?

తనను తాను పునఃసృష్టించుకొని కొత్త జీవితాన్ని ప్రారంభించగలడు కాబట్టి బ్రహ్మ?

త్రిమూర్తులు ముగ్గురు లేరు . ముగ్గురూ ఒక్కరిలోనే ఉన్నారు . ఆయనే పరబ్రహ్మ . బ్రహ్మ విష్ణు మహేశ్వరులు పరబ్రహ్మ స్వరూపాలు .

పై ముగ్గురూ మానవుని ఆశ్రయించుకొని వున్నారు కాబట్టి నేను(అహం) ఎవరు ?

' అహం బ్రహ్మోస్మి '

ఈ వేదాంత మహావాక్యంలోని బ్రహ్మ, పరబ్రహ్మ.

శివుడికున్న మూడోనేత్రం(జ్ఞాననేత్రం) తనకూ వుంది కాబట్టి మానవుడు తాను పరబ్రహ్మ స్వరూపుణ్నని గుర్తించగలడు.

************

# జగమంతకుటుంబం

పాట

పల్లవి : జగమంతకుటుంబం నాది , ఏకాకిజీవితం నాది
సంసారసాగరం నాదే, సన్యాసం , శూన్యం నావేలే

చరణం : కవినై ,కవితనై ,భార్యనై ,భర్తనై
మల్లెలదారుల్లో , మంచు ఎడారుల్లో
పన్నీటిజయగీతల,కన్నీటి జలపాతాల
నాతో నేను సహగమిస్తూ ,నాతో నేను రమిస్తూ
ఒంటరినై ప్రతినిమిషం కంటున్నాను నిరంతరం
కలల్ని,కథల్ని ,మాటల్ని , పాటల్ని ,రంగుల్ని ,రంగవల్లుల్ని
కావ్యకన్యల్ని ,ఆడపిల్లల్ని //జగమంత//

శ్రీ సిరివెన్నల సీతారామశాస్త్రి గారు అద్వైత దృక్పధం లో వ్రాసిన ఈ పాట ఆధారంగా చేసుకుని చిత్ర దర్శకుడు కృష్ణవంశీ ' చక్రం ' సినిమా నిర్మించారు .కానీ బ్రతికేవాడు ఎలా బ్రతకాలో తెలిపే పాటను చావబోయే వాడు చచ్చే ముందు చెప్పే ఫిలాసఫీ గా మార్చేసారు . కానీ ఆ పాటను వెలుగులోకి తెచ్చిన ఘనత ఆయనదే .

$$1^{+1} \times 1^{-1} = 1$$

రెండు ఒకటి

$$(X^{+1} \times X^{-1})^{+1} \times (1)^{-1} = 1$$

పై సమీకరణంలో '1' రెండుగా ($1^{+1} \times 1^{-1}$) విడిపోయింది . రెండిట్లో ఒకటి ($1^{+1}$) తిరిగి, క్రింది సమీకరణంలో , రెండుగా అనేకం($X^{+1} \times X^{-1}$) గా మారిపోయింది . ($X$) స్థానంలో ఏ సంఖ్యనైనా ప్రతిక్షేపించుకోవచ్చు .సృష్టిలో ఉన్నది ఒకటే నని అదే రెండుగా అనేకంగా మారిపోయిందని అద్వైత తత్వసారాంశం ఈ తత్వానికి ఆదిశంకరాచార్యలు ఆద్యులు.ఈ అద్వైత తత్వానికి పై సమీకరణం 'skeleton' అయితే దానికి రక్త మాంసాలు కల్పించి ప్రాణం పోసింది శాస్త్రి గారి పాట. నవరసాలకు మూలమైన తత్వం ఈ పాటలో ఉంది .

$$(X^{+1} \times X^{-1})^{+1} \times (1)^{-1} = 1$$

జగమంతకుటుంబం ఏకాకిజీవితం నేను(నాది)

జగమంతకుటుంబం : ($X^{+1} \times X^{-1}$) లో X బదులుగా (కవి ×కవిత),(భర్త × భార్య),(భగవంతుడు × భక్తుడు) ....ఇలా ఒకరికొకరు వరసైన జంటలను ఎన్నైనా ప్రతిక్షేపించుకోవచ్చు. కానీ ఏవరసకావరసే.తమ్ముడు తమ్ముడే పేకాట పేకాటే, ఏమాటకామాటే . ఒక వరస పనిచేస్తున్న సమయంలో రెండోది పనిచెయ్యదు . అలా ఏ వరసకు ఆ వరసను , ఏ రసానికి ఆ రసాన్ని విడివిడిగా గుర్తించడమే సామరస్యం .

$$(2^{+1} \times 3^{-1}) \neq 1$$

పై సమీకరణంలో 2 వేరు ,3 వేరు . అందువల్ల అవి ఒకటి కాలేదు ($\neq 1$) అలాగే మనిషి మాటలకు చేతలకు పొంతన లేకపోతే అతడు ‘వ్యక్తి’ కాలేడు .‘వ్యక్తి’త్వ లోపం వంచనకు,ఆత్మవంచనకు,సంఘర్షణకు దారితీస్తుంది . ఐక్యమత్యమే బలం అన్నట్టు మనస్సు,వాక్కు,కర్మ మూడింటికి పొంతన కుదిరి ఐక్యం (ఒకటి)గా ఉంటేనే నైతిక బలం సిద్ధిస్తుంది. మనోవాక్కాయకర్మలలో ఏకత్వమే చిత్తశుద్ధి ,నిజాయితీ.

$$2^{+1} \times 2^{-1} = 1$$
$$3^{+1} \times 3^{-1} = 1$$

పై సమీకరణాలు రెండింటిలోనూ ఏకత్వం ,ఒకటి( 1) ఉంది .కానీ రెండు సమీకరణాలు ఒకలా లేవు. భిన్నంగా ఉన్నాయి . అలాగే ఏ ఇద్దరి జీవితాలు ఒకలా ఉండవు . ఉదాహరణకు శ్రీరాముడు,శ్రీకృష్ణుడు.వీరిద్దరిలోను, పై సమీకరణాల్లో లాగే ఏకత్వం-మనోవాక్కాయకర్మలలో ఏకత్వం -ఉంది . కానీ ఇద్దరి జీవితమార్గాలు ఒకలాలేవు . విలక్షణంగా ఉన్నాయి. కారణం వారు ఏకత్వానికి,చిత్తశుద్ధికి ప్రాధాన్యత యిచ్చి,అలావుండడానికి నిరంతర సాధన చెయ్యడం వల్ల ఆసాధన ఫలితం ఒక విలక్షణ జీవితవిధానంగా దానంతట అదే రూపుదిద్దుకుంది .ఈ విలక్షణత అంతవరకు కొనసాగుతూ వస్తున్న సాంప్రదాయాన్ని సమర్థించవచ్చు ,లేదా వ్యతిరేకించవచ్చు . అలాకాకుండా ముందే ఏదో ఒక జీవితవిధానాన్ని ఆదర్శంగా పెట్టుకుని తదనుగుణంగా జీవించడం మొదలుపెడితే అది స్వభావానికి,పరిస్థితులకు విరుద్ధమై , మనోవాక్కాయకర్మలలో ఏకత్వాన్ని (integrity)పోగొట్టి అస్థిత్వాన్నే భంగపరుస్తుంది.అస్తిత్వంతో ఉండడమంటే ఏకత్వంతో ఉండడమే .అప్పుడే వ్యక్తిత్వము,విలువలు ,స్వేచ్ఛ సిద్ధిస్తాయి . “Is it true?” అని కాక “Is it true for me?” అనేది ఇక్కడ ప్రాధాన్యత వహిస్తుంది .

<u>ఏకాకిజీవితం : </u>‘జగమంతకుటుంబం నాది’ అనుకునేవాడికి ఏకాకిజీవితం తప్పదు . ఎందుకంటే అతడు ఏ వర్గంలోను,వ్యవస్థలోను,వ్యక్తులతోను చేరడు . కాబట్టి అతడు ఏకాకి, సన్యాసి. ఎందులోనూ చేరడు కాబట్టే అందర్నీ కలుపుకుపోగలడు . అందువల్ల అతనిది జగమంతకుటుంబం ,సంసారసాగరం .

**<u>నేను (సృష్టికర్త ):</u>** సంక్షిప్త రూపం లో ఉన్న **1** విస్తృత రూపం దాల్చి **$(X^{+1} \times X^{-1})$** అయినట్లు , సూక్ష్మరూపంలో వుండే విత్తనం స్థూలరూపం పొంది వృక్షం అవుతున్నట్టు ,ఏకాకిగా వున్న 'నేను' ఇంతితై వటుడింతయై అన్నట్టు విశ్వమంత అయ్యాను . ఏకాకియైన శ్రీకృష్ణుడు ,తన విశ్వరూపాన్ని అర్జునుడికి చూపించాడు .

**1** లో **$(X^{+1} \times X^{-1})$**వున్నట్టు ,విత్తనంలో వృక్షం దాగి వున్నట్టు , ఏకాకి లో విశ్వం ఇమిడి

వుంది . ఏకాకి ఐన శ్రీకృష్ణుడు తన తల్లి యశోదకు తనలోనే (నోట్లోనే ) విశ్వాన్ని చూపించాడు .

విశ్వం నాలో నుండే సృష్టి అవుతోంది(evaluation)కనుక జగమంతకుటుంబం నాది . విశ్వం నాలో లీనం (లయం ) అయినపుడు నేను తప్ప ఎవరూ వుండరు కనుక ఏకాకిజీవితం నాది . ఏకత్వంలో భిన్నత్వం జగమంతకుటుంబం. భిన్నత్వంలో ఏకత్వం ఏకాకిజీవితం.

ఏకాకిగా వున్న సృష్టికర్త కవిగా ,కవితగా ,భార్యగా ,భర్తగా ...........సృష్టిగా మారి జగమంత అయ్యాడు . మట్టి, కుండగా మారినట్టు సృష్టికర్తే సృష్టిగా మారాడు . మాధవుడే మానవుడయ్యాడు . నరనారాయణులు ఒక్కరే . నరుడే నారాయణుడు .

నరుడు ప్రేమికుడిగా,భావుకుడిగా ,భక్తుడిగా ఉన్నపుడు పాడుకోవడానికి ప్రేమగీతాల్ని, భావగీతాల్ని,భక్తిగీతాల్ని ఇంతవరకు కవులందరూ వ్రాసారు . కానీ నరుడు నారాయణుడిగా వున్నపుడు పాడుకునే భగవద్ గీత శాస్త్రి గారి 'జగమంతకుటుంబం'

ఉన్నది ఒకటే నని ,రెండుగా కనిపిస్తున్నవన్నీ ఒకే దానికున్న రెండు పార్శ్వాలని అద్వైతతత్వ సారాంశం.మనిషి ఏ పార్శ్వంలో ఉన్నా,జ్ఞాననేత్రంతో రెండో పార్శ్వం యొక్క ఉనికిని,దాని విలువను గుర్తించగలడు .

లౌకిక జీవితాన్ని ,ఆధ్యాత్మికతను వేరు వేరుగా చూసేవారికి ఆ రెండిట్లో ఏ ఒక్కటీ, ఎప్పటికీ పూర్తిగా అవగాహనకు రాదు . అద్వైతం లౌకికజీవితానికి అధ్యాత్మికతను జోడిస్తుంది . ఇహపరాలను రెంటినీ ఒక్కటి చేస్తుంది .

“ఒకటీ రెండంటూ......” సీతారామ శాస్త్రి గారు స్వయంగా పాడి వినిపించిన ఈ link లోని పాట ఈ రచనకి చక్కని ముగింపు .

****************************

## అస్తిత్వ వాదం

అస్తిత్వవాదానికి అద్వైతానికి దగ్గర సంబంధం ఉంది. కర్క్ గార్డ్ ఈ వాదానికి మూలపురుషుడు.సాహిత్యం ద్వారా ఈ వాదానికి ప్రాచుర్యం తీసుకువచ్చిన వాళ్ళుసార్త్రే,కేమూ. ఇద్దరూ దార్శనిక గ్రంధాలు వ్రాసారు.ఇద్దరికీ నోబెల్ బహుమతి వచ్చింది .సార్త్రే స్వీకరించలేదు.

సార్త్రే అస్తిత్వ వాద దృక్పధంలో అస్తిత్వానికి మూడు పొరలు ఉంటాయి . అవి . 1. తనలో తను(being in itself ) 2. తనకై తను (being for itself ) 3.ఇతరుల కోసం తను (being for others ). ఈ మూడు స్థాయిల్ని ఈ క్రింది సమీకరణం ద్వారా అర్థంచేసుకోవచ్చు.

$$1 = 1^{+1} \times 1^{-1} = 1$$

1 = సమాజం × నేను = వ్యక్తి

**1. తనలో తను(being in itself)** : నేను, సమాజాన్ని నాలో లయం చేసుకుని ఏకమై వ్యక్తి గా రూపొందాను. ఇప్పుడు నేను సమాజంతో సహా నా 'వ్యక్తి'త్వంలో ఉన్నాను. 'నా వ్యక్తిత్వంలో నేను ఉన్నాను' అంటే నాలో నేను ఉన్నాను. ఇదే తనలో తను గా ఉండడం . వ్యక్తిత్వంతో ఉండడం.

**2. తనకై తను (being for itself ) :** ఇపుడు వ్యక్తిలోనుండి నేను(అహం) బయటకొస్తే, దాంతోపాటూ సమాజమూ వస్తుంది. నేను సమాజాన్ని నాకంటే భిన్నంగా చూస్తాను. దానితో ఘర్షణ పడతాను. ఈ ఘర్షణ నుండి బయట పడడం కోసం నేను తాత్కాలికంగా వ్యక్తి గా మారి నేను-సమాజం పడుతున్న ఘర్షణను సమీక్షిస్తాను. ఈ సమీక్ష నిష్పక్షపాతంగా జరగవచ్చు,జరగకపోవచ్చు . ఇది తనకై తను స్థాయి. ఇక్కడ నేను ,వ్యక్తి విడివిడిగా ఉండడం వల్ల ఇందులో ద్వైతం ఉంది. తనలో తను స్థాయి లో నేను వ్యక్తిలో ఇమిడిపోవడం వల్ల ద్వైతం లేదు. అద్వైతం,ఏకత్వం ఉన్నాయి.

**3.ఇతరుల కోసం తను (being for others):** నన్నూ సమాజాన్ని ఏకం చెయ్యగల వ్యక్తిత్వం నాకు లేదు. అంటే నేను వ్యక్తిగా మారలేదు.(తనలో తను స్థాయి). అలాగని నేను సమాజంతో విభేదించలేను(తనకై తను స్థాయి).ఇప్పుడు నేను ఏంచెయ్యాలి?. అట్నుంచి నరుక్కురావాలి. సమాజాన్ని నాతో కలుపుకుపోయే బదులు , నేనే దానిలో కలిసిపోవాలి. ఇందుకోసం సమాజం(ఇతరుల)దృష్టిలో నన్ను గూర్చిన అభిప్రాయం ఏమి ఉన్నదో దాన్ని ఊహించి,దాంతో ఏకీభవించి ,నా ప్రవర్తనను అలా రూపొందించుకోవాలి. ఇది గుర్రానికి బండిని కట్టడానికి బదులు ,బండిని ముందు నిలబెట్టి వెనక గుర్రాన్ని కట్టడం లాంటిది. ఇతరులలో నన్ను గూర్చిన అభిప్రాయం గుర్రంలాగా నన్ను లాగుతుంటే, నేను బండి లాగా,జడంగా, బానిసలా ఇతరుల వెంటపడడం . ఇది 'ఇతరులకోసం' జీవించడం.ఇక్కడ వ్యక్తి కనిపించడు.(1 = సమాజం × నేను). ఉదాహరణకు ఇతరుల దృష్టిలో నేనొక అమాయక చక్రవర్తి ననుకోండి. ఆ అభిప్రాయాన్ని నిలుపుకోవడం కోసం(ఇతరులకోసం) నేను లేని అమాయకత్వాన్ని నటించడం. అలాగే మంచివాణ్నని నలుగురిలో నాకు పేరుంది . ఈ అభిప్రాయాన్ని నిలుపుకోవడంకోసం నేను నానా తంటాలు పడడం. ఇంకొక ఉదాహరణ . సిగరెట్ కాల్చే అలవాటు నాకు లేదు . ఈ విషయం తెలీక ఎవరో formality గా నాకు సిగరెట్ offer చేస్తారు . అంటే నాకు సిగరెట్ కాల్చే అలవాటుందనే కదా అవతలి వారి అభిప్రాయం-అని నేనూహించి ఆ అభిప్రాయంతో నేనేకీభవించి అవతలివారి కోసం నేను సిగరెట్ స్వీకరిస్తాను. అలవాటు లేకపోవడం వల్ల ఇబ్బంది పడుతూ సిగరెట్ కాలుస్తాను . ఈ ఇబ్బందిని నేను గుర్తించి దానినుంచి బయటపడితే అది తనకై తను స్థాయి . ఇబ్బంది పడుతూ 'ఇతరుల కోసం' దానిని కొనసాగిస్తే, నేనింకా ఇతరులకోసమే ఉన్నట్లు. తనలోతను స్థాయిలో జీవిస్తే ఈ ఇబ్బంది ఉండదు. సిగరెట్ అలవాటు లేదని ముందే చెప్పడం జరుగుతుంది .

'డిటిని కలుపుకుపోయే వ్యక్తి ఉంటాడు . 'తనకై తను' లో నేను 'ఇతరులకోసం తను' లో సమాజం ప్రాధాన్యత వహిస్తాయి. సమాజం గుమ్మడికాయల దొంగ అంటే నేను భుజాలు తడుముకోవడం 'ఇతరులకోసమే' .

తనలో తను స్థాయిలో వ్యక్తిత్వం ,విలువలు ,స్వేచ్ఛ ఉంటాయి. తనకై తను స్థాయిలో వాటికోసం చేసే ప్రయత్నం ఉంటుంది . ఇతరులకోసం తను లో జడత్వం,బానిసత్వం,పరప్రత్యయనేయ బుద్ధి వల్ల శైధిల్యం సంభవిస్తాయి.

సామాజికుడైన ప్రతి మానవునిలో ఈ మూడు పొరల అస్తిత్వం ఉంటుంది . ఎవ్వరూ దాన్నుంచి తప్పించుకోలేరు . ఏది ప్రాధాన్యం వహిస్తుందన్నదే కీలకం .

నేను వ్యక్తి గా మారడమంటే గొంగళిపురుగు సీతాకోకచిలుకగా మారడం . ఈ మార్పును ,ఈ పరిణామాన్ని 'నేను' చనిపోవడంగా భావించి భయపడతాను . అందుకే 'అహం'భావాన్ని విడిచిపెట్టను . భయాన్ని జయించి అహాన్ని వ్యక్తిత్వంలో లయం చేస్తేనేగాని స్వేఛ్ఛ లభించదు. చూసే దాన్ని చూడు అంటారు వేదాంతులు . సమాజాన్ని ,సృష్టిని నేను చూస్తాను. చూసే 'నేను' ను వ్యక్తి చూడగలడు.

వ్యక్తి అంటే స్వేఛ్ఛ అని కర్క్ గార్డ్ నిర్వచిస్తాడు . సామాజికుడైన మానవునికి ఈ నిర్వచనం ఎట్లా వర్తిస్తుంది . దానికి సార్త్రే సమాధానం . "వ్యక్తి అంటే స్వేఛ్ఛ అని నిర్వచించినపుడు అది ఇతరుల మీద ఆధారపడినది కాదు . తద్వారా ఏర్పడే నిబద్ధత ఎటువంటిదంటే నేను నా స్వేచ్ఛను సంకల్పిస్తే, ఇతరుల స్వేచ్ఛను సంకల్పించినట్లవుతున్నది. అలా సంకల్పించక పోతే స్వేచ్ఛ నా లక్ష్యంగా నెరవేరదు". నేను ఉంటే సమాజమూ ఉంటుంది. నేను నా స్వేచ్ఛను సంకల్పిస్తే ఇతరుల స్వేచ్ఛను సంకల్పించ వలసివుంటుంది .

## వేదాంత మహావాక్యాలు

వేదాంత మహావాక్యాలు నాలుగు . అవి 1. తత్వమసి 2. అయమాత్మా బ్రహ్మ 3. ప్రజ్ఞానం బ్రహ్మ 4. అహం బ్రహ్మాస్మి.
ఈ క్రింది వివరణలో తత్వమసి మహావాక్యం బదులుగా 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అను వాక్యం స్వీకరించబడింది .

$$(1^{+1} \times 1^{-1})^{+1} \times (1)^{-1} = 1$$

| జగత్తు | జీవుడు | ఈశ్వరుడు |
| --- | --- | --- |
| (జ్ఞేయం) | (జ్ఞాత) | (జ్ఞానం) |

పై సమీకరణం అంతటా జగత్తుగా,జీవుడుగా,ఈశ్వరుడుగా ఉన్నది ఒకే ఒకటి (1). అది బ్రహ్మం. ఉన్నది బ్రహ్మమే(1). జడపదార్థంగా ఉన్న శరీరం(జగత్తు)బ్రహ్మం(1).శరీరంలో బంధితున్నైన నేను(జీవుడు)బ్రహ్మం(1).జీవ,జగత్తులను వ్యాపించి,వాటిని తనతో ఏకం చేసే ఈశ్వరచైతన్యం(జ్ఞానం) కూడా బ్రహ్మమే(1).

జగత్తు బ్రహ్మమే ----- సర్వం ఖల్విదం బ్రహ్మ
జీవుడు బ్రహ్మమే ---- అయమాత్మా బ్రహ్మ
ఈశ్వరుడు(జ్ఞానం)బ్రహ్మమే ----- ప్రజ్ఞానం బ్రహ్మ
(ఉన్నదంతా బ్రహ్మం అయినపుడు)
నేనూ బ్రహ్మమే ,బ్రహ్మమే నేను ----- అహం బ్రహ్మాస్మి

ఈశ్వరుడు,జీవుడు,జగత్తు-మూడూ-ఒకటే,బ్రహ్మమే,సమానమే. తాడును చూసి పాము అనుకోవడం మాయ. ఈ మాయ వల్లే బ్రహ్మం జీవజగదీశ్వరులుగా భాసిస్తోంది. తాడును

గుర్తించగానే పాము మాయమైనట్టు బ్రహ్మాన్ని గుర్తించగానే జీవజగదీశ్వరులు మాయమై బ్రహ్మం మిగులుతుంది. వివిధ ఆభరణాల రూపంలో ఉన్నది ఒకే బంగారం అయినట్టు,జీవజగదీశ్వరుల రూపంలో ఉన్నది ఒకే బ్రహ్మం. మాయను తొలగించుకొని బ్రహ్మాన్ని గుర్తించడం ఒక మెట్టు. ఆ తర్వాత ఆ బ్రహ్మాన్ని అన్ని రూపాలలోనూ దర్శించడం రెండవ మెట్టు .
సుఖదుఃఖాలు,మంచిచెడ్డలు,జననమరణాలు మొదలైన ద్వంద్వాలను జీవితవిశేషాలు గా కాకుండా జీవితసత్యాలు గా, సామాన్యంగా సమదృష్టితో చూడడం అలవాటు చేసుకుంటే,ఆ జ్ఞానంతో సహా అంతా బ్రహ్మమయం గానే కనిపిస్తుంది.

మహావాక్యాలను గూర్చి లోతైన విమర్శ మహావాక్య విచారణ లో చూడవచ్చు.

## అద్వైతాన్ని గూర్చి స్వామి వివేకానంద
## (‘లేవండి ,మేల్కొనండి!’ నుండి)

“మతం,కళ,విజ్ఞానం - ఈ మూడు ఒకే సత్యం యొక్క విభిన్న అభివ్యక్తనలు. కాని దీన్ని అర్ధం చేసుకోవాలంటే అద్వైత సిద్ధాంతం అవసరం"

"ద్వైతం,విశిష్టాద్వైతం,అద్వైతం-ఇవి మతశాఖలు కావు.మతమనే యాత్రలోని మూడు మజిలీలు.సాధకుల మనస్సు యొక్క మూడు దశలు లేదా అవస్థలు.ప్రతి సాధకుడు (ఏ మతస్థుడైనా సరే ) ద్వైతం నుంచి మొదలు పెట్టి ,విశిష్టాద్వైతస్థితికి చేరి ,చివరికి గమ్యమైన అద్వైతస్థితికి చేరాలి. ఈ అద్వైతానుభవానికే ముక్తి ,నిర్వాణం ,సమాధి ,కైవల్యం దైవ సాక్షాత్కారం ఇత్యాదిగా ఎన్నో పేర్లు".

“శాస్త్రమంటే ఏకత్వగ్రహణమేగాని మరొకటి కాదు. పరిపూర్ణమైన ఏకత్వం ప్రాప్తించగానే -అదే గమ్యప్రాప్తి కాబట్టి -శాస్త్ర పురోగమనం ఆగిపోతుంది. ఎందులోవుండి ఇతర పదార్ధాలన్నీ నిర్మాణంకాగలవో అలాంటి మూల పదార్థాన్ని కనుగొనటంతో రసాయనశాస్త్ర పురోగమనం పరిసమాప్తమౌతుంది. ఎందులోనుంచి ఇతర శక్తులన్నీ వెలువడుతున్నవో అలాంటి ఏకశక్తిని కనుగొంటే ,పదార్ధవిజ్ఞానశాస్త్రం (ఫిజిక్స్) తన పరిశ్రమను సఫలం చేసుకోగలుగుతుంది. నశ్వరమైన ప్రపంచంలో ఎవడు అనశ్వరచైతన్య స్వరూపుడో ,ఈ సవికారవిశ్వంలో ఎవడు శాశ్వతాధారభూతుడో ,సమస్త జీవులూ ఎవడి మయారూపాలో ,అట్టి పరమాత్ముణ్ణి కనుగొంటే మతశాస్త్రం (=బ్రహ్మవిద్య) పరిసమాప్తిని పొందుతుంది . ఈ విధంగా నానాత్వమూలంగానూ ద్వైతమూలం గానూ పరమైక్యం(అద్వైతం) ప్రాప్యమౌతోంది . ఇదే సమస్త మతాలకూ -సమస్త ధర్మాలకూ -పరమావధి . ఇదే సకల శాస్త్రగమ్యం . సమస్తశాస్త్రాలూ పర్యవసానంలో ఈ సిద్ధాంతానికి రాకతప్పదు.”
“స్వస్వరూపజ్ఞానం కలిగాక వేదాంతికి ఈ ప్రపంచమంతా అదృశ్యమౌతుంది. ఇది తిరిగి దృశ్యమౌతుంది . కాని,ఇది మునుపటి దుఃఖప్రపంచం కాదు.దుఃఖమనే కారాగారం ప్రస్తుతం సత్తుగా,చిత్తుగా, ఆనందంగా రూపొందుతుంది . ఈ స్థితిని పొందటమే అద్వైత సిద్దాంత లక్ష్యం.”

“వేదాంతతత్వమంతా ఈ కింది కథలో ఇమిడివుంది .
ఒకే చెట్టుమీద రెండు పక్షులున్నవి - ఒకటి చిటారుకొమ్మమీద ,రెండవది కింది కొమ్మమీద . పైపక్షి ప్రశాంతంగా ,మౌనంగా ,గంభీరంగా స్వకీయ వైభవంలో మునిగివుంది. కిందిపక్షి తీయని పళ్ళను

చేదుపళ్ళను తింటూ ,ఒక కొమ్మనుంచి మరొక కొమ్మమీదికి ఎగురుతూ సుఖాసుఖాలను అనుభవిస్తోంది. కొంతసేపటికి యీ కిందిపక్షి మరింత చేదుపండును తిని ,విసుగుచెంది ,తల ఎత్తి ఆ పైపక్షిని చూసింది . బంగారు ఈకలున్న ఆ అద్భుతపక్షి తీయని పళ్ళుగాని చేదుపళ్ళు గానీ తినటంలేదు. దానికి కష్టానుభూతిగాని , సుఖానుభూతిగాని లేదు. ప్రశాంతంగా,అత్మస్థమై ,తన ఆత్మను తప్ప వేరుదేన్నీ చూడక ,కూర్చునివుంది. ఆ స్థితి పొందటానికై కింది పక్షి తీవ్రంగా ఆకాంక్షిస్తుందిగాని, అచిరకాలంలోనే మరచి మళ్ళా పళ్ళను తినటం ప్రారంభిస్తుంది. కొంతసేపటికి మరొక అతి చేదుపండు తిని, ఎంతో ఖేదమొంది, మళ్ళా పైకి చూసి , యింకొక పైకొమ్మ కెగిరింది. అలా పైపైకి ఎగిరి ఎగిరి, చివరికి ఆ చక్కని పక్షికి అతిచేరువులోకి వస్తుంది. చివరకు అది పైనున్న పక్షి చోటుకు వచ్చి దాన్లో తనసే కోల్పోయింది. రెండు పక్షులు లేసేలేవనీ ,ప్రశాంతమై గంభీరమై ఆత్మవైభవంలో వెలుగొందుతూన్న పైపిట్ట తానే అనీ అది తటాలున గ్రహించింది. నిజానికి తా నెప్పుడూ ఆ పైపక్షే . ఈ తినటం ,యీ తీయనిపళ్ళు యీ చేదుపళ్ళు ,యీ కింది చిన్నపక్షి, ఒకసారి సుఖించటం,ఒకసారి దుఃఖించటం - యిదంతా కేవలం భ్రమ,స్వప్నం. పై పక్షి భగవంతుడు,జగదీశ్వరుడు. కిందిది జీవాత్మ."

$$(X^{+1} \times X^{-1})^{+1} \times (1)^{-1} = 1$$

తియ్యటి x చేదు పళ్ళు కిందిపక్షి పైపక్షి

$$(X^{+1} \times X^{-1})^{+1} \times (1)^{-1} = 1$$

తియ్యటి x చేదు పళ్ళు కిందిపక్షి పైపక్షి

**********************

## స్వీయ కవితలు

### <u>అల్పపీడనం</u>

హృదయ సాగరంలో అల్పపీడనం ఏర్పడినపుడు
ఉవ్వెత్తున ఎగసిపడుతున్న భావకెరటాలు
గుండె గట్లను తెంచుకుని వ్యక్తం కావాలని ,కాలేక
నిర్మలాకాశ వదనాన్ని అలుముకున్న విషాద మేఘాలై
లోకాన్ని హత్తుకుని కురిపిస్తున్న కన్నీటి వర్షం,
ధారలై ,ఏరులై తిరిగి సాగర హృదయం వైపే ప్రయాణిస్తూ
'ధ్వని'స్తున్నాయి, తనతో తను సమాధానపడలేని
హృదయం లోకంలో ఎప్పుడూ ,ఎక్కడా సమాధానపడలేదని .

*************************

My Address : Bhavaraju Srinivasu
Postal Assistant.
RAZOLE- P.O
East Godavari District.
Andhra Pradesh.
533242.
Ph: 9490237780
e-mail: bhavaraju2@gmail.com